
సాక్షి
పల్నాడు

సోమవారం । 22 । మే । 2023




కార్మెల్‌మాతకు పూజలు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు గుంతకల్లు, ధర్మవరం, పొద్దుటూరు, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 521.00 అడుగుల వద్ద ఉంది. ఇది 151.1053 టీఎంసీలకు సమానంగా ఉంది.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో ఎంపీ మోపిదేవి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎంపీకి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఎంపీకి బహూకరించారు.

భూములపై విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: దళితులకు, దేవదాయశాఖకు మధ్య ఏర్పడిన భూముల వివాదంలో విచారణాధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను నియమించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఆదేశాలు ఇచ్చారు. 2008వ సంవత్సరంలో పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణ సందర్భంగా దాచేపల్లి మండలం ఏలియన్‌పేటకు చెందిన వారు భూములు కోల్పోయారు. నిర్వాసితులైన సుమారు 77 మంది దళితులకు పునరావాసం కింద ఇచ్చిన భూముల విషయంలో దేవదాయ శాఖకు సంబంధించిన భూములుగా ఘర్షణలు తలెత్తటంపై ప్రచురితమైన వార్త కథనాలపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణ సమయంలో ఇరువర్గాల వారు ఘర్షణలకు తావివ్వకుండా సహకరించి సమస్యను పరిష్కరించే విధంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

నేడు ప్లస్ టూ స్కూళ్లలో మిగిలిన పోస్టులకు కౌన్సెలింగ్

తెలుగు సబ్జెక్టులో 25 పోస్టుల భర్తీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లస్ టూ తరగతుల బోధనకు రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భర్తీ కాగా, మిగిలిన పోస్టుల భర్తీకై సోమవారం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగనుంది. ఆదివారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ తెలుగు సబ్జెక్టులో ఖాళీలుగా చూపిన 25 పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో రీ-డిప్లాయిమెంట్ పద్ధతిపై భర్తీ చేశారు. కాగా ఇంగ్లిష్, సివిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుతో పాటు ఫిజిక్స్-4, కెమిస్ట్రీ-మూడు, జువాలజీ-మూడు, ఎకనామిక్స్-రెండు, కామర్స్‌లో మూడు చొప్పున పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని డీఈఓ పి.శైలజ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ కె. సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇండియాస్ ఆర్కిటెక్చురల్ హెరిటేజ్ పుస్తకం ఆవిష్కరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారతదేశ చారిత్రక వైభవాన్ని తెలియజేస్తూ అద్భుతమైన చారిత్రక ఫొటోలతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు, చారిత్రక అన్వేషకుడు కేఎస్ వసిఫ్ రూపొందించిన 'ఇండియాస్ ఆర్కిటెక్చురల్ హెరిటేజ్' అనే పుస్తకాన్ని ఇంతియాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ మహత్తర వారసత్వ కళా సంపదను రచయిత పుస్తక రూపంలో కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో పుస్తక రచయిత వసిఫ్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'సూక్ష్మ'ంలో మోక్షం

- ఉద్యాన రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు అందజేత
- చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై బిందు, 55 శాతంతో తుంపర సేద్య పరికరాలు
- పల్నాడు జిల్లాలో 2023-24 ఏడాదిలో 2,500 హెక్టార్లలో ఏర్పాటుకు లక్ష్యం
- 2022-23 సంవత్సరంలో 1,582 హెక్టార్లలో పరికరాలు అమర్చుకున్న 1,799 మంది రైతులు
- ఆర్బీకేల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ



స్ప్రింకర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

సాక్షి, నరసరావుపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ సంస్కరణలు చేపడుతున్నారు. ఆర్బీకేల ఏర్పాటు, రైతు భరోసా, పంటల బీమా, సాగు పరికారాలు, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం ... ఇలా ఎన్నో కార్యక్రమాల ద్వారా రైతు ప్రభుత్వమన్న ముద్ర వేసుకున్నారు. వీటికి అదనంగా సూక్ష్మసేద్యం ప్రోత్సహించడంలో భాగంగా బిందు, తుంపర సేద్య పరికరాలను సరఫరా చేయడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయడమే లక్ష్యంగా సూక్ష్మ సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు సమకూర్చనుంది. పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ... సాగును లాభదాయకంగా మార్చేందుకు పూనుకుంది. గత ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్ల కంపెనీలకు బకాయిలు ఉండటంతో సూక్ష్మసాగు అమలుకు కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్కారు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాయితీపై ఐఎస్ఐ గుర్తింపు ఉన్న డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను విరివిగా అందజేస్తున్నారు. జిల్లాలో పది ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు ఉండగా, రైతులకు నచ్చిన కంపెనీ ఎంచుకోవచ్చు.

జిల్లాలో 2,500 హెక్టార్లే లక్ష్యంగా...

పల్నాడు జిల్లాలో సుమారు 50 వేల మంది రైతులు 81,590 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు. వీరిలో ఔత్సాహిక రైతులకు సాగు పద్ధతులపై ఉద్యానవన, మైక్రో ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా అవగాహన కల్పిస్తున్నారు. 2023-24 సంవత్సరంలో జిల్లాలో 2,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్య పరికరాలు అమర్చేలా అధికారులు లక్ష్యంగా పనిచేస్తున్నారు. సూక్ష్మ సేద్య పరికరాల కోసం ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం 3,157 మంది రైతులు ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సీనియార్టీ ఆధారంగా రైతులకు పరికరాలు అందజేస్తారు.

గతేడాది(2022-23) 1,500 హెక్టార్ల లక్ష్యం గాను 1,582 హెక్టార్లలో 1,799 మంది రైతులు పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చి పంటలకు నీరు అందిస్తున్నారు. సుమారు 80 శాతం మంది డ్రిప్ యంత్రాలకు, 20 శాతం మంది స్ప్రింక్లర్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ...

సూక్ష్మ సేద్యం పథకంలో ఐదు ఎకరాలు లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. డ్రిప్ యూనిట్ విలువలో 10 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. 5 ఎకరాల పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇవ్వనున్నారు. డ్రిప్ విలువలో 50 శాతం రైతులు భరించాల్సి ఉంటుంది. ఇక స్ప్రింకర్ల యూనిట్లు ఐదు ఎకరాల లోపు రైతులకు 55 శాతం, 5 ఎకరాల పైన భూమి ఉన్న రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింకర్లు పరికరాలు పొందవచ్చు. ఆర్బీకేల ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతుల భూమి విస్తీర్ణం, బోరు సౌకర్యం తదితర వివరాలను ఆర్బీకే సిబ్బందితో పాటు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయక సిబ్బంది పరిశీలిస్తారు. అర్హత కలిగిన రైతులకు పరికరాలను రాయితీపై అందించేలా జాబితా సిద్ధం చేస్తారు. మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు పడుతుండటం, నాగార్జునసాగర్, పులిచింతలకు ఏటా నీరు వస్తుండటంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మాచర్ల, గురజాల, రెంటచింతల, దుర్గి, బొల్లాపల్లి, వెల్దుర్తి, పిడుగురాళ్ల, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింకర్లకు డిమాండ్ పెరిగింది.

సూక్ష్మ సేద్యంతో అధిక దిగుడులు...



సేద్యంలో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. సబ్సిడీ పరికరాలు అర్హులైన రైతులకు మాత్రమే అందేలా చూస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటికే 3,157 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కమర్షియల్ రైతులు బాగా లాభపడుతున్నారు. డ్రాగన్, తైవాన్ జామ, కూరగాయలు సాగుచేసే రైతులు గతంలో కంటే అధిక దిగుబడులు పొందుతున్నారు. జిల్లాలో వచ్చే ఏడాది 2,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్య పరికరాలు అమర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.

–సీహెచ్ ఆంజనేయులు, పల్నాడు జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి

సూక్ష్మ పరికరాలతో అధిక దిగుబడి ..



నాకున్న 5 ఎకరాల్లో కరివేపాకు పంట సాగు చేస్తున్నాను. డ్రిప్ వల్ల నీటి వసతి సమస్య తీరుతుందని దరఖాస్తు చేసుకున్నాను. రెండు హెక్టార్లలోపు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు ఇస్తుండటం చాలా ఉపయోగం. రైతుల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పొలం సాగు చేసే అవకాశం ఉండటంతో, గతంతో పోల్చితే ఎకరాకు రెండు టన్నుల అధిక దిగుబడి వస్తోంది.

– గంగాధర్‌రెడ్డి, రైతు, చెరుకుపాలెం గ్రామం, అచ్చంపేట మండలం

బాలికపై లైంగికదాడి

తెనాలిరూరల్: చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి 13 ఏళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. మూడు గంటల పాటు తన గదిలోనే ఉంచుకుని అర్ధరాత్రి బాలికను ఇంటికి పంపాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లితోపాటు స్థానిక మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వైకుంఠపురం సమీపంలో గల పోతురాజు కాలనీలో నివసించే రాడ్‌బెండింగ్ కార్మికుడు కొప్పుల రాజు అలియాస్ సోగ్గాడు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మనస్పర్థల కారణంగా ఇతడి భార్య, పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఎనిమిదేళ్లుగా కాలనీలో ఒంటరిగా ఉంటున్న రాజు, పిల్లలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, యాచక మహిళలనే టార్గెట్ చేస్తూ తరచూ ఏదో ఒక గలాటా సృష్టిస్తూ ఉంటాడు. ఈ క్రమంలో 13 ఏళ్ల బాలిక శనివారం రాత్రి 8 గంటల సమయంలో దుకాణానికి వెళ్లి వస్తుండగా, బాలికను పిలిచి డబ్బులు ఇచ్చి సిగరెట్లు, కూల్‌డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. బాలికనూ రూ.10 ఇచ్చి కొనుక్కోమన్నాడు. తిరిగి దుకాణానికి వెళ్లి వచ్చిన బాలికను తాను ఉండే గదిలోకి తీసుకెళ్లాడు. సుమారు మూడు గంటలపాటు బాలికను గదిలోనే ఉంచిన అతను ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి వేళ ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిన బాలిక జరిగింది తల్లికి చెప్పింది. స్థానికులతో కలసి రాజు ఉండే గదికి వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి జారుకున్నాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రులతోపాటు స్థానికులంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొప్పుల రాజు దగ్గర్లోని ఒక ప్రార్థన మందిరం కింద గదిలోకి తీసుకెళ్లి వేధించి లైంగికదాడి చేశాడని బాలిక తల్లి వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారని, బాలికపై దారుణానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లి సహా స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. బాధిత బాలికను పోలీసులు వైద్య పరీక్షల కోసం తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లను సన్మానిస్తున్న మంత్రి విడదల రజిని

- సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే వారధులు వలంటీర్లేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతున్నదని చెప్పారు. గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలు వెళుతున్నాయన్నారు. ప్రతి నెలా ఒకటోతేదీ వేకువజామునే పింఛన్లు పంపిణీ చేసే విషయంలో వలంటీర్ల కృషి గొప్పదని చెప్పారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. ఏకంగా 2.5లక్షలకు పైగా వలంటీర్లు, 1.5 లక్షల వరకు సచివాలయ ఉద్యోగులు మొత్తం 4లక్షల మంది ఈ వ్యవస్థ కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న తీసుకొచ్చిన పరిపాలన సంస్కరణల్లో ఇదొక గొప్ప వ్యవస్థ అని వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణం, మండల పరిధిలో ఏడుగురికి సేవా రత్న ద్వారా ఒక్కొక్కరికి రూ. 20వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి, 703 మందికి సేవా మిత్ర ద్వారా ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు వీరు అందిస్తున్న మెరుగైన సేవలకు గుర్తింపుగా ఈ బహుమతులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకోండి

జిల్లా కలెక్టర్ శివశంకర్



చిన్నారులతో కలసి పుస్తకాలు చదువుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేటఈస్ట్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, చిన్నతనం నుంచి విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం కలెక్టర్ శివశంకర్ సందర్శించి పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు గడిపారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న విజ్ఞాన, వినోద, పరిశోధనాత్మక, మత, రాజకీయ, సామాజిక పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి పుస్తక పఠనాన్ని ప్రోత్సహించారు. ప్రతిరోజూ న్యూస్ పేపర్‌తోపాటు వినోద, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలని సూచించారు. విద్య, విజ్ఞానం, మహనీయులు రచించిన పుస్తకాలు, వారి జీవిత చరిత్రలు, బాలల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రంథాలయం ర్యాక్‌లలోని పుస్తకాలను పరిశీలించి ఆసక్తి కలిగించే పలు పుస్తకాలను చదివారు. ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకుంటూ, గ్రంథాలయాల అభివృద్ధికి సహరించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ, కోఆపరేటివ్ సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 16,631మంది విద్యార్థులు



ఎం.నీలావతిదేవి, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి ఆదివారం తెలిపారు. ఈనెల 24వతేదీ నుంచి జూన్ 1 వరకు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుందని వివరించారు. సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాటు చేసిన 34 పరీక్ష కేంద్రాలలో 16,631మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో 11,116మంది జూనియర్ ఇంటర్, 5,515మంది విద్యార్థులు సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. జూనియర్ ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులలో సప్లిమెంటరీతో పాటు బెటర్‌మెంట్ రాసే విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల నియామకం పూర్తి చేశామన్నారు. వీరితో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఒక అధ్యాపకునితోపాటు వ్యాయామ అధ్యాపకుడు లేదా గ్రంథాలయాధికారి, రెవెన్యూ అధికారి, పోలీస్ అధికారి ఉంటారని తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్‌లో అధ్యాపకునితోపాటు వ్యాయామ అధ్యాపకుడు లేదా గ్రంథాలయాధికారి ఉంటారన్నారు. ఇన్విజిలేటర్ల కొరత తలెత్తితే భర్తీ చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సహకారంతో ఉపాధ్యాయులను నియమిస్తామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, పోస్టల్, ఆర్టీసీ, వైద్య, ఇతర ప్రభుత్వ శాఖాధికారుల సహకారం తీసుకుంటామని తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రతను దృష్టిలో నుంచుకొని తగిన ఏర్పాట్లు చేయవలసినదిగా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలు ఇచ్చామన్నారు. గాలి, వెలుతురు ఉండేలా గదులు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యసేవలు అందించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా వైద్యశాఖాధికారిని కోరినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం వేసవి ఎండలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రారం'డి' వేడుక చేద్దాం

ప్రభుత్వ భూమి సాగుచేస్తున్న భూమిలేని రైతులకు 'డీ' ఫారం పట్టాలు

- నాడు వైఎస్సార్.. నేడు వైఎస్ జగన్ హయాంలోనే పంపిణీ
- ప్రభుత్వ ఆదేశాలతో అర్హులను ఎంపిక చేస్తున్న రెవెన్యూ వర్గాలు
- అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం తరువాత పంపిణీ మరూ..
- 1,017 మంది రైతులకు 1,654 ఎకరాలు పంపిణీకి సిద్ధం
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేస్తామంటున్న జేసీ శ్యాంప్రసాద్



సాక్షి, నరసరావుపేట: ఏళ్లుగా వారు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్నారు. కానీ వాటిపై హక్కు మాత్రం లేదు.. ఏదైనా ప్రకృతి విపత్తు వల్ల పంట నష్టపోతే ఏ విధమైన పరిహారమూ అందడం లేదు. ఏళ్లుగా దుక్కి దున్ని సాగు చేస్తున్నా పిడికెడు మట్టిపై కూడా ఎటువంటి హక్కు లేకుండా కాలం వెళ్లదీస్తున్నారు. అటువంటి వారి బాధలు తెలిసిన మనస్సున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండటంతో వారందరికీ పట్టాలు అందించేందుకు సిద్ధమయ్యారు. జీవనాధారంగా ప్రభుత్వభూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతులకు 'డీ' పట్టాలు పంపిణీ చేసి అండగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. సీఎం ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 14 ఏళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భూ హక్కులు కల్పించారు. సుదీర్ఘ కాలం అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో తిరిగి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సీఎం నిర్ణయంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు పొందే వారిలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధికంగా ఉన్నారు.

1,654.99 ఎకరాలు సిద్ధం...

పల్నాడు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూమిని ఎంత మంది సాగు చేస్తున్నారన్న విషయమై జాయింట్ కలెక్టర్ నేతత్వంలో అధికార యంత్రాంగం ఇప్పటికే గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. ప్రతి గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించి అర్హుల జాబితా సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 10 మండలాల పరిధిలో 1,017 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. వారికి త్వరలో 1,654.99 ఎకరాలకు పట్టాలు అందజేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో అత్యధికంగా మాచర్ల, బొల్లాపల్లి, దుర్గి మండలాల పరిధిలో ఎక్కవ మంది రైతులు ఉన్నారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను రైతులకు ప్రభుత్వం బహుమానంగా ఇవ్వనుంది.

అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం తర్వాత...

సాగుభూమికి సంబంధించి రైతులకు పట్టా ఇచ్చేందుకు ప్రత్యేకంగా అసైన్‌మెంట్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా జిలా ఇన్‌చార్జి మంత్రి వ్యవహరిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్లుగా జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, ఆర్డీఓ ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీలు ఉంటారు. కమిటీ ఆమోదం తీసుకున్న తర్వాత పేద రైతులకు డీ-ఫారం పట్టాలు పంపిణీ చేస్తారు.

ఈ భూములకు పట్టాలు ఇవ్వరు ...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోరంబోకు భూములు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు పట్టాలు ఇవ్వరు. వ్యవసాయ యోగ్యమైన భూమిని మాత్రమే అసైన్డ్ చేస్తూ డీ పట్టా ఇస్తారు. గతంలో పట్టాలు ఇచ్చిన, ప్రభుత్వం ఇతరత్రా అవసరాలకు వినియోగించే ఆలోచన ఉన్న భూములను రైతులకు పట్టాలు ఇవ్వరు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పట్టాలు..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టా పొందేందుకు అర్హులైన పేద రైతులకు పట్టాలు ఇవ్వమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అర్హులైన రైతుల గుర్తింపు ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. ఇప్పటికే జిల్లాలో 1,654.99 ఎకరాలు సాగు చేస్తున్న 1,017 మంది రైతులను గుర్తించాం. త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి, కమిటీ ఆమోదం తీసుకుని పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపడతాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి డీ ఫారం పట్టాల పంపిణీ జరుగుతుంది.

– శ్యాంప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్

అర్హతలు ...

- సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప రైతుకు ఇతరత్రా పట్టా భూమి ఉండకూడదు.
- సాగు చేసుకుంటున్న భూమిని ఇంతకు ముందు ఎవరికీ డీ-పట్టాగా ఇచ్చి ఉండకూడదు.
- దరఖాస్తులో పొందుపరచిన భూమిలో సదరు రైతు తప్పనిసరిగా సాగు చేసుకుంటూ ఉండాలి.
- అన్ని అర్హతలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జరిగే అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందాలి.
- అర్హత ఉన్న రైతుకు తడి 2.50 ఎకరాలు లేదా మెట్ట 5 ఎకరాల మించకుండా డీ-పట్టా మంజూరు చేస్తారు.

సత్తెన్న చిరస్మరణీయులు

మంత్రి అంబటి రాంబాబు



సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నాటి సత్తెన్న పేరే నేటి సత్తెనపల్లి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్తెన్న విగ్రహావిష్కరణ జరిగి నెలరోజులైన సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పొరవ తీసుకొని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పక్కా సూరిబాబు తదితరులు సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ నడిబొడ్డున సత్తెన్న విగ్రహావిష్కరణ ద్వారా సత్తెన్న చారిత్రక నేపథ్యం చిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. వడ్డెర సంఘ నాయకులు మంత్రి అంబటి రాంబాబుకు సత్తెన్న జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, వడ్డెర సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు, వడ్డెర సంఘ నాయకులు చెంబేటి శివ రామకృష్ణ, బత్తుల సాంబశివరావు, కందుల నాగేశ్వరరావు, కొమెర శివశంకర్, మల్లెల పాపారావు ఉన్నారు.

పల్నాటి చరిత్రను పరిరక్షించాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: పల్నాటి చరిత్ర, దాని ప్రభావాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అభివృద్ధి సమావేశం ఆదివారం నిర్వహించారు. మండలంలోని గామాలపాడులో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం పునర్నిర్మాణంతో పాటుగా ఇది దేవాలయ నిర్మాణం పై చర్చించారు. ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ జూన్ 7వ తేదీన దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం పరిధిలోని 18 ఎకరాల భూమిని బాగు చేశామని, ప్రముఖ శైవక్షేత్రంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు దర్శులు తీసుకున్నామని తెలిపారు. దేవాలయాల నిర్మాణం ఒక వైపు పల్నాటి చరిత్ర రాబోయే తరాలకు తెలిసేలా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. సుమారు రూ.100 కోట్లతో పనులు చేపట్టాలని అంచనా వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ సాయంతో పాటుగా దాతలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయానికి నాలుగు వైపులా గోపురాలు నిర్మాణం కూడా చేపడతామని చెప్పారు. సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్స్ దేవళ్ల రేవతి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కౌన్సిలర్లు షేక్ షరీఫ్, వంటపు వెంకట్రామయ్య, స్థానికులు మాశెట్టి బుజ్జి, కుందురు తిరుపతిరెడ్డి, బత్తుల వెంకయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, మాశెట్టి పుల్లారావు, కొలా నవజ్యోతి, చిట్టిప్రోలు అమరలింగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత భవితకు నవోదయం

- ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆహ్వానం
- ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూలై 22న ప్రవేశ పరీక్ష
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం



మద్దిరాల నవోదయ విద్యాలయ ముఖద్వారం

సత్తెనపల్లి: పల్లెల్లోని ప్రతిభావంతులకు నాణ్యమైన విద్యనందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులు. 2006 జూన్ ఒకటో నుంచి 2008 జూలై 31 మధ్య జన్మించిన వారు ప్రవేశ పరీక్ష రాయడానికి అర్హులుగా పరిగణిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యనభ్యసించేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల కేటాయింపు ఇలా ..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణాల్లో ఉన్నవారికి 25 శాతం సీట్లు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 35 శాతం బాలికలను చేర్చుకుంటారు. జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి కేంద్రం నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించింది.

మన ప్రత్యేకతలివే ..

- మద్దిరాల నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో సుమారు 30 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి, ఇతర ప్రవేశ పరీక్షల్లో రాణించేందుకు వారికి అవసరమైన ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఎయిమ్స్‌కు సంబంధించిన సమాచారం డిజిటల్‌లో పొందవచ్చు.
- విశాలమైన ఆటస్థలం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు ఇస్తుంటారు. ఇక్కడి విద్యార్థులు ఏటా వివిధ క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు.
- విద్యతోపాటు క్రీడలు, ఎన్‌సీసీ, యోగా, చిత్రలేఖనం, సంగీతం, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. అత్యున్నత విద్యార్హతలు, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు.

పరీక్ష విధానం ఇదీ....

నవోదయ ప్రవేశ పరీక్షల్లో 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, సైన్స్, సాంఘిక శాస్త్రం, లెక్కలు సబ్జెక్ట్‌లో 20 ప్రశ్నలు చొప్పున ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. మొత్తం 2.30 గంటల వ్యవధిలో పరీక్ష రాయాలి.

సమాచారం

ప్రవేశ పరీక్ష తేదీ: 22.07.2023

దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్: డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ నవోదయ డాట్ జీవోవీ డాట్ ఇన్

దరఖాస్తుకు చివరి తేదీ: 31.05.2023

దళారులను నమ్మొద్దు



విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తాం. విశాలమైన క్రీడా మైదానం ఉంది. పిల్లలు ఒత్తిడికి గురి కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇక్కడ చదువు కున్నవారిలో కొందరు అత్యున్నత స్థాయిలో స్థిరపడ్డారు. కష్టపడి చదివితే నవోదయలో సీటు సంపాదించడం సులభం. ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. పారదర్శకంగానే ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.

–నల్లూరి నరసింహారావు, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం, మద్దిరాల

హెచ్ఐవీతో జీవించే వారిపై వివక్ష తగదు

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ మెమోరియల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

నరసరావుపేట: జిల్లాలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మనోధైర్యం, వివక్ష లేకుండా జీవించే విధంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌తో చనిపోయిన వారి స్మరించుకుంటూ ర్యాలీ ప్రతి ఏడాది 'మే' నెల మూడో ఆదివారం నాడు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ర్యాలీలో జేసీ శ్యామ్‌ప్రసాద్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.పద్మావతి, ప్రభుత్వ వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ దయానిధి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన బీజేపీ నేత బ్రహ్మారెడ్డి



బ్రహ్మారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి, పక్కన మాజీ ఎమ్మెల్యే యర్రం తదితరులు

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు ఈపూరి బ్రహ్మారెడ్డి ఆదివారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బ్రహ్మారెడ్డికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సత్తెనపల్లి మండలం కందులవారిపాలేనికి చెందిన బ్రహ్మారెడ్డి 25 ఏళ్ల క్రితమే సత్తెనపల్లి వచ్చి స్థిరపడ్డారు. గతంలో బీజేపీలో ఉన్న ఆయన కొంత కాలం క్రితం బీజేపీలో చేరారు. ఐదేళ్ల పాటు వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, పక్కా సూరిబాబు, ఆదర నాయకుల సమక్షంలో బ్రహ్మారెడ్డికి మంత్రి అంబటి రాంబాబు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పల్నాడు జిల్లా వైద్య విభాగం కన్వీనర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రియుడితో మనస్పర్థలు.. యువతి ఆత్మహత్య



రమ్య మృతదేహం

తెనాలి రూరల్: ప్రియుడితో మనస్పర్థల కారణంగా యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన తురుమెళ్ల రమ్య(22) పలు ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటుంది. తల్లిదండ్రులకు దూరంగా గత కొద్ది కాలంగా తెనాలిలో ఒంటరిగా నివాసం ఉంటోంది. విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రధాన నగరాల్లో ఈవెంట్లు చేసుకుంటూ నందులపేటలోని మూత బావి వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. ఈ క్రమంలో పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన సూర్యతేజతో పరిచయం ఏర్పడగా మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య తరచూ మనస్పర్థలు రావడంతో సూర్యతేజ రమ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రమ్య తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు శనివారం రాత్రి తల్లికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. తిరిగి ఫోన్ చేసినప్పటికీ ఎంతకీ ఫోన్ ఎత్తకపోవడంతో వారు తెనాలి చేరుకుని చూడగా ఇంట్లోని రమ్య ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు తెలిపారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని చెప్పారు. తల్లితో ఫోన్ మాట్లాడుతున్న సమయంలోనే రమ్య ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై స్పష్టత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు కోరారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత స్కూల్ అసిస్టెంట్లకు సర్వీసు నిబంధనల మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఒక ఇంక్రిమెంట్‌తో నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గత జనవరిలో రూ.2500 అలవెన్సుతో ఉపాధ్యాయుల్ని ఉన్నత పాఠశాలల్లో తాత్కాలికంగా సర్దుబాటు చేశారని, 30 శాతం కోటా కింద చెల్లిస్తున్న పాఠశాలల్లో అనుకూలంగా ఉపాధ్యాయుల ప్రస్తుత ఉద్యోగోన్నతులు కల్పించి ప్రమోషన్ల విషయంలో చొరవ తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌ను మాన్యువల్ విధానంలో నిర్వహిస్తున్న దృష్ట్యా, ఉపాధ్యాయుల నుంచి ముందుగానే ఆప్షన్ తీసుకోవాలన్నారు, ఇతర జిల్లాల అవసరం లేదని, కౌన్సెలింగ్ సమయంలో నచ్చిన పాఠశాలల్ని వారు కోరుకుంటారన్నారు. బదిలీల విషయంలో న్యాయం జరిగే విధంగా సమగ్రమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అన్ని రకాల ప్రాధాన్యతాక్రమాల్ని పరిగణనలోకి తీసుకుని పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగోన్నతులు, బదిలీల విషయంలో ఒకే విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి. పెదబాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్. వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లేశ్వరరావు మృతి



మంగళగిరి: జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు (74) గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని పార్కు రోడ్డులో నివాసం ఉంటున్న పుల్లేశ్వరరావు అదివారం తెల్లవారుజామున నివాసంలో గుండెపోటుకు గురై ఆసుపత్రికి తరలిస్తుండగా పోయారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందారు. గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పవర్ లిఫ్టర్లకు పుల్లేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. నగరంలోని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో నేటికీ ఆయన వలువురు పవర్ లిఫ్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. పుల్లేశ్వరరావు ఆకస్మిక మృతిపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పుల్లేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పవర్ లిఫ్టింగ్ కోచ్‌లు ఎస్‌కే సందాని, ఖాజామొహిద్దీన్‌లతో పాటు పలువురు లిఫ్టర్లు పుల్లేశ్వరరావు ఆకస్మిక మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల వార్షిక గ్రాంటు రెట్టింపు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణకు కేటాయిస్తున్న వార్షిక గ్రాంటును రెట్టింపు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవలింగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో పాఠశాలకు గ్రాంట్ రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉండగా, గత విద్యా సంవత్సరంలో 20 శాతం చొప్పున రెండువిడతలుగా విడుదల చేశారని తెలిపారు. నిధుల్ని కూడా కొంత మంది హెచ్ఎంలు ఖర్చు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని తరగతులకు డిజిటల్ విద్యనందిస్తోందని, ఈ కారణంగా పాఠశాలల్లో విద్యుత్ వినియోగం పెరిగిందని, గదుల్లో ఫ్యాన్లు, లైట్లతో పాటు మినరల్ కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్లు ఏర్పాటు చేసిన దృష్ట్యా విద్యుత్ బిల్లులు చెల్లింపుకే నెలకు రూ.వెయ్యి నుంచి రూ.ఏనిమిది వేల వరకు ఖర్చువుతోందని తెలిపారు. పాఠశాలల నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం గ్రాంట్స్ రెట్టింపు చేసి విద్యా సంవత్సరం ముందే విడుదల చేయాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ పాఠశాలలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాలీద్, మజ్జిన శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ బి. శివ శంకరరావు, పెన్షనర్ల వెంకటేశ్వర్లు, ఎండీ. ఖుద్దూస్ పాల్గొన్నారు.

విదేశీ విద్యా యోగ ప్రాప్తిరస్తు

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం
- 379 యూనివర్సిటీలు, ఇనిస్టిట్యూట్లలో వివిధ కోర్సుల్లో చేరే అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు, కాపు విద్యార్థులకు వరం
- జూన్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు



నెహ్రూనగర్: ఉన్నత వర్గాలకు చెందిన వారే ఇప్పటి దాకా విదేశాల్లో చదువుల్లో రాణిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, కాపు విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదువుకోవాలంటే అంతంత మాత్రంగానే మిగిలిపోతోంది. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారి కలల్ని సాకారం చేసేందుకుగాను జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని తీసుకువచ్చారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ ర్యాంకింగ్స్ 2023 ప్రకారం టాప్ 50 ఇనిస్టిట్యూట్లు, యూనివర్సిటీల్లో 21 సబ్జెక్టుల(ఫోర్ ఫ్యాకల్టీ ఆఫ్ సబ్జెక్ట్స్)తో పాటు దాదాపు 379 యూనివర్సిటీలు, సంస్థల్లో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది.

ఆర్థిక సాయం పొందేందుకు అర్హత కలిగిన సబ్జెక్టులు ఇవీ

అకౌంటింగ్, ఫైనాన్స్, వ్యవసాయం, డిజైన్, మానవీయ శాస్త్రాలు, బయోలాజికల్ సైన్సెస్, వ్యాపారం, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్, మీడియా వ్యూహం, కంప్యూటర్ సైన్సెస్, ఎకనామిక్స్, ఎకనామెట్రిక్స్, విద్య, శిక్షణ, ఎలక్ట్రికల్, ఎల్రక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మైనింగ్, ఇంజినీరింగ్ పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్, చట్టం, మెడిసిన్, సహజ శాస్త్రాలు, భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రాలకు చెందిన సబ్జెక్టులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది.

21 మందికి నిధులు విడుదల

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద విదేశాల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న 21 మంది విద్యార్థులకు 03–02–2023 నాటికి రూ.1,21,01,304 మంజూరయ్యాయి.

అర్హతలు

- క్వాలిఫైయింగ్ కోర్సుల్లో 60శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకం కింద అర్హులు.
- ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకునే ఇంటర్మీడియట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలి.
- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద అర్హులైన, ఎంపికైన వారికి వంద శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.125 లక్షలు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఏది తక్కువైతే అది మంజూరు చేస్తారు.
- ఇతర కేటగిరీల్లో ఉన్న విద్యార్థులకు వంద శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.100లక్షలు... వీటిల్లో తక్కువైతే అది మంజూరు చేస్తారు.
- కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.8లక్షలు మించకూడదు.
- నోటిఫికేషన్ ప్రచురణ తేది నాటికి గరిష్ట వయస్సు 35 సంవత్సరాలు మించకూడదు.
- ఆధార్ ధ్రువీకరణ పత్రం పథకం కోసం నిర్దేశించిన పోర్టల్ మాత్రమే ఉండాలి.

జూన్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలి



జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు అభ్యసించేందుకు గాను ప్రభుత్వం ఆర్థిక సాయం సాయం అందిస్తుంది. అర్హులైన విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా httpr: jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– డి. మధుసూదన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ